Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
RNI NO. TELTEL/2023/88559
తెలుగు దినపత్రిక
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

‘రామాయణం’ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రభంజనం.. రూ.100 కోట్లకు చేరువలో!

4



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 201 | పేజీలు : 4 | నవంబర్ 5 గురువారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 201 | PAGES:4 | THURSDAY NOVEMBER 5 2026 | Rs. 4:00

“డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా”.. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఓటర్లు రిపబ్లికన్ పార్టీకి గట్టి గుణపాఠం చెప్పారు. ఎన్నికల ఫలితాలకు ముందు వరకు డెమొక్రాట్లు ప్రవేశపెట్టే ప్రతీ బిల్లును వీటో చేస్తానని గర్జించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఘోర పరాజయం తర్వాత అనూహ్యంగా స్వరం మార్చారు. దేశ శ్రేయస్సు కోసం డెమొక్రాట్లతో కలిసి పనిచేయడానికి సిద్ధమని ప్రకటించారు. “ఈ ఎన్నికల్లో నేను బ్యాలెట్‌పై లేను, ఒకవేళ ఉండుంటే మేము భారీ మెజారిటీతో గెలిచేవాళ్లం” అని వ్యాఖ్యానించారు ఈ ఎన్నికల్లో డెమొక్రాట్లు అంచనాలకు మించి ప్రతినిధుల సభ (హౌస్), సెనెట్ రెండింటినీ కైవసం చేసుకోవడంతో ట్రంప్ ఈ మేరకు దిగిరాక తప్పలేదు.ఎన్బీసీ న్యూస్ అంచనాల ప్రకారం, 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు 256 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. అదేవిధంగా, 100 మంది సభ్యులున్న సెనెట్‌లో కనీసం 54 స్థానాలు దక్కించుకుని స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించారు. ధరలు తగ్గిస్తానని, ప్రజల జీవితాలను సులభతరం చేస్తానని 2024 ఎన్నికల్లో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన ట్రంప్, ఆ తర్వాత ఆ హామీలను పక్కనపెట్టారు. అమెరికాను గొప్పగా మార్చేందుకు టారిఫ్‌లు విధించడం, ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోసం యుద్ధానికి దిగడం, వైట్‌హౌస్ సుందరీకరణ వంటి భారీ ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ఇవే ఆయన పట్ల ప్రజాగ్రహానికి కారణమయ్యాయి.రిపబ్లికన్లకు కంచుకోటలైన టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి రాష్ట్రాల్లో పార్టీ ఓటమి పాలుకావడం (మిగతా 2వ పేజీలో..)

సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

- సదర్‌ను అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించిన ప్రభుత్వం
- వేడుకల నిర్వహణకు రూ.5 కోట్ల నిధులు కేటాయింపు
- హైదరాబాద్‌లోని గోల్కొండ ఒకనాటి గొల్లంకొండ అని రేవంత్ వ్యాఖ్య





సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి ‘గొల్లంకొండ’ అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట

డీప్‌టెక్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: భట్టి



- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం
- పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా మారాలి
- స్టార్టప్‌లకు పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు
- యువతకు విస్తృత ఉపాధి అవకాశాలే లక్ష్యం

హైదరాబాద్, నవంబరు 4 :

తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్ది, ప్రపంచస్థాయి టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో డీప్‌టెక్, సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బుధవారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఎఫ్ఐసీసీఐ శతాబ్ది వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరిశోధనలు ప్రయోగశాలలకే

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం: మంత్రి పొన్నం



- ప్రయాణికురాలి దాడిలో గాయపడిన మహిళా కండక్టర్ ప్రవళిక మృతి
- మృతురాలి తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పొన్నం హామీ
- ఉస్మానియా మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి నివాళి అర్పించిన మంత్రి

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద అక్టోబర్ 25న ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. టికెట్ డబ్బుల చిల్లర విషయమై ప్రయాణికురాలు మౌనికతో జరిగిన గొడవలో... ప్రవళికను కదులుతున్న బస్సు నుంచి కిందకు తోసేయడంతో ఆమె వెనుక చక్రాల కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. పది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న రాత్రి ఆమె కన్నుమూశారు. ఈ ఘటనపై ఇప్పటికే నిందితురాలైన ప్రయాణికురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

- మోదీ బహిరంగ చర్చకు రావాలన్న గాంధీ
- ఘాటుగా స్పందించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్
- చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని స్పష్టీకరణ
- సమాధానాలు వినకుండా సభ నుంచి వాకౌట్ చేయడంపై విమర్శలు
- ఆధారాలతో చర్చకు వచ్చి, ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని సూచన



బహిరంగ చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సిద్ధమా? అంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. చర్చలకు సరైన వేదిక పార్లమెంట్ అని, సోషల్ మీడియా కాదని తేల్చిచెప్పారు. ఈ మేరకు తన ‘ఎక్స్’ ఖాతాలో రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె వరుస పోస్టులు చేశారు. “రాహుల్ జీ, చర్చకు వేదికను ఎంచుకోమని మీరు ప్రధానిని కోరుతున్నారు. దానికి ఇప్పటికే ఒక వేదిక ఉంది, అదే పార్లమెంట్. దానికి మీరే ప్రతిపక్ష నాయకుడిగా (మిగతా 2వ పేజీలో..)

తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

- తమిళనాడులో కొత్త సినిమాలకు రోజుకు 6 షోలకు అనుమతి
- రిలీజైన మొదటి వారం పాటు వర్తించనున్న కొత్త నిబంధన
- సీఎం జోసెఫ్ విజయ్ అధ్యక్షతన ప్రభుత్వం కీలక ఉత్తర్వుల జారీ
- సినీ సంఘాల విజ్ఞప్తి మేరకు నిబంధనలను సవరించిన సర్కార్
- ప్రభుత్వ నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమ హర్షం



తమిళ సినీ పరిశ్రమకు అక్కడి ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. రాష్ట్రంలోని థియేటర్లలో కొత్తగా విడుదలయ్యే తమిళ చిత్రాలకు రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకునేందుకు (మిగతా 2వ పేజీలో..)

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే: పొంగులేటి

- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే
- అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ
- పక్కా హద్దులతో కొత్త పాస్‌బుక్కుల జారీ
- 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు

హైదరాబాద్, నవంబరు 4 :

వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమికి సమగ్ర సర్వే నిర్వహిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. భూ సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని, భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ తరహాలో భద్రతతో కూడిన



భూ రికార్డులు అందిస్తామని తెలిపారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భూ సర్వే, రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి అధికారులకు (మిగతా 2వ పేజీలో..)

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు



కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర (మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

సం పా ద కీ యం

ప్రజాస్వామ్యానికి ప్రాణం.. స్వతంత్ర జర్నలిజం

అధికారం ప్రశ్నలను ఇష్టపడకపోవచ్చు.. కానీ ప్రజాస్వామ్యం మాత్రం ప్రశ్నలతోనే బలపడుతుంది. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం, అవినీతిని ప్రశ్నించడం, అణగారిన వర్గాల గొంతుకగా నిలవడం మీడియా బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చినప్పుడే జర్నలిజానికి నిజమైన గౌరవం లభిస్తుంది.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియాకు ప్రత్యేక స్థానం ఉంది. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు ప్రజల తరఫున ప్రశ్నించే శక్తిగా పత్రికా రంగం నిలుస్తుంది. అయితే నేటి పరిస్థితుల్లో జర్నలిజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్యాల ప్రభావం, తప్పుడు ప్రచారాలు వార్తా స్వేచ్ఛకు పరీక్షగా మారుతున్నాయి.ప్రజలకు ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియజేయాల్సిన బాధ్యత మీడియాపై ఉంది. కానీ కొన్ని సందర్భాల్లో వార్తల కంటే సంచలనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. వాస్తవాలను పరిశీలించకుండా ప్రచారం చేయడం, వ్యక్తిగత విమర్శలను వార్తలుగా చూపించడం, నిర్ధారణ కాని ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వడం వృత్తి విలువలను దెబ్బతీస్తున్నాయి. వేగం కోసం పోటీపడే క్రమంలో నిజానిజాల నిర్ధారణను విస్మరించడం ప్రమాదకరం.మరోవైపు, ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా కథనాలు రాసే జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటి సదుపాయాలు అందని పరిస్థితులు ఉన్నాయి. వార్తల సేకరణ కోసం సొంత ఖర్చులతో ప్రయాణాలు చేస్తూ, సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న ఎంతోమంది జర్నలిస్టుల జీవన పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. వారి సమస్యలను పరిష్కరించాల్సిన యాజమాన్యాలు, ప్రభుత్వాలు, జర్నలిస్టు సంఘాలు మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.ప్రజాస్వామ్యానికి స్వతంత్ర మీడియా ఎంత అవసరమో, మీడియాకు స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అంతే అవసరం. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించడం ప్రతిపక్షాలకే పరిమితం కాదు. ప్రజల తరఫున మీడియా కూడా ప్రశ్నించాలి. అదే సమయంలో వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో కాకుండా ఆధారాలు, వాస్తవాల ఆధారంగా వార్తలు ప్రచురించాలి. విమర్శకు, వ్యక్తిగత దూషణకు మధ్య ఉన్న తేడాను గుర్తించాలి.సోషల్ మీడియా విస్తరణతో ప్రతి ఒక్కరికీ సమాచారం పంచుకునే అవకాశం వచ్చింది. అయితే అదే వేదికపై తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో విశ్వసనీయమైన పత్రికలు, బాధ్యతాయుతమైన జర్నలిస్టుల అవసరం మరింత పెరిగింది. వార్తను ప్రచురించే ముందు పరిశీలించడం, సంబంధిత వర్గాల అభిప్రాయాలు తెలుసుకోవడం, తప్పులు జరిగితే సరిదిద్దుకోవడం మీడియా విశ్వసనీయతకు పునాది కావాలి.జర్నలిజం అనేది కేవలం వార్తల ప్రచురణ కాదు.. సమాజానికి దిశానిర్దేశం చేసే బాధ్యత. పేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, అణగారిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే మీడియా తన సామాజిక బాధ్యతను నెరవేర్చినట్లవుతుంది. అధికారాన్ని ప్రశ్నించే కలం భయపడకూడదు. అదే సమయంలో ఆ కలం నిజాయితీని కోల్పోకూడదు.ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. విమర్శను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడం, నిజాలను గౌరవించడం పాలనకు బలాన్నిస్తాయి. స్వేచ్ఛాయుతమైన, బాధ్యతాయుతమైన జర్నలిజం ఉన్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుంది. కలం ప్రజల పక్షాన నిలవాలి.. నిజం వైపు నడవాలి.. సమాజ హితం కోసం నిరంతరం పనిచేయాలి.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

మొదటి పేజీ తరువాయి)

నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

సదర్ వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

మొదటి పేజీ తరువాయి)

దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఈశ్వరమ్మ యాదవ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో విజయవంతంగా నిర్వహించిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రాబోయే రోజుల్లో యాదవులకు న్యాయమైన వాటా దక్కేలా చూస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలో గోసంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో విస్తరణ వంటి అభివృద్ధి ప్రాజెక్టులకు యాదవ సోదరులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డీప్‌టెక్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు: భట్టి

మొదటి పేజీ తరువాయి)

పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఉత్పత్తులుగా రూపాంతరం చెందాలని సూచించారు.

డీప్‌టెక్ అభివృద్ధికి హైదరాబాద్‌లో అవకాశాలు

డీప్‌టెక్ రంగం అభివృద్ధికి హైదరాబాద్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రం ముందుకు సాగుతోందని వివరించారు. పరిశ్రమలు, పరిశోధకులు, ప్రభుత్వ శాఖలు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడే ఆవిష్కరణలకు తగిన ఫలితాలు వస్తాయని చెప్పారు. యువ స్టార్టప్‌లకు ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, సులభతర ధ్రువీకరణ విధానాలు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ఆవిష్కరణలకు ప్రభుత్వం, పరిశ్రమలు అండగా నిలవాలని, విజయవంతమైన ప్రయోగాలను విస్తృత స్థాయిలో అమలు చేయాలని సూచించారు.

విద్యుత్, వైద్య, వ్యవసాయ రంగాల్లో ఆవిష్కరణలు

పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ, స్మార్ట్ గ్రిడ్ వ్యవస్థల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య రంగంలో వ్యాధులను ముందుగానే గుర్తించే అధునాతన పరికరాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలో రైతులకు తక్కువ ఖర్చుతో ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. కొత్త ఉత్పత్తుల రూపకల్పన దశ నుంచే సామాన్యులకు అందుబాటు ధరల్లో వాటిని అందించే అంశాన్ని దృష్టిలో పెట్టుకోవాలని తెలిపారు.

యువతకు ఉపాధి.. పరిశ్రమలకు సాంకేతిక చేయూత

డీప్‌టెక్ రంగం యువతకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పించగలదని భట్టి విక్రమార్క అన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పాదకత పెంపునకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడాలని పేర్కొన్నారు. ఆవిష్కరణల ఫలితాలు ప్రజల ఆదాయాల పెరుగుదల, మెరుగైన ప్రభుత్వ సేవలు, కొత్త ఉద్యోగాల రూపంలో కనిపించాలని స్పష్టం చేశారు. భారతీయ ఆలోచనలు, సాంకేతిక ఆవిష్కరణలు ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే: పొంగులేటి

మొదటి పేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు.

వివాదరహిత భూములకు కొత్త పాస్‌బుక్కులు

భూములపై వివాదాలు లేకుండా స్పష్టమైన హద్దులతో కొత్త పాస్‌బుక్కులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు వారానికోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే పురోగతిని పరిశీలించాలని సూచించారు. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భారీ స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నామని పేర్కొన్నారు. సర్వే నంబర్లలో నమోదైన వివరాలకు, వాస్తవంగా రైతుల స్వాధీనంలో ఉన్న భూములకు మధ్య ఉన్న తేడాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సరిహద్దు వివాదాల పరిష్కారంపై దృష్టి

పట్టా భూములు, వాటి హద్దులకు సంబంధించిన వివాదాలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించాలని మంత్రి సూచించారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యలను అధికారుల సమక్షంలోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను దాచకుండా వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు

22-ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పొంగులేటి అధికారులను ఆదేశించారు. ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురిచేసే అధికారులపై తక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

"డెమొక్రాట్లతో కలిసి పనిచేస్తా".. ఎన్నికల ఫలితాలతో స్వరం మార్చిన ట్రంప్

మొదటి పేజీ తరువాయి)

ఆయన అంచనాలను తీవ్రంగా దెబ్బతీసింది. కాన్సాస్‌లో 95 ఏళ్ల రిపబ్లికన్ల గుత్తాధిపత్యానికి తెరదించుతూ డెమోక్రాట్ అభ్యర్థి ఆడమ్ హామిల్టన్ సెనెటర్‌గా గెలిచారు. టెక్సాస్ గవర్నర్‌గా హినా హినోజోసా ఎన్నికవడంతో 36 ఏళ్ల రిపబ్లికన్ పాలనకు ముగింపు పడింది. ట్రంప్ స్వయంగా ఎంపిక చేసిన అభ్యర్థులు సైతం ఓడిపోవడం ఆయనకు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బ. ఈ ఓటమితో పార్టీపై ట్రంప్ పట్టు సడలుతుందని, ఆయనను వ్యతిరేకించే వారి సంఖ్య పెరుగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అధ్యక్షుడిగా మిగిలిన రెండేళ్లలో ఆయన దూకుడుకు కళ్లెం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఫలితాల తర్వాత 'పొలిటికో'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "రెండేళ్ల పాటు ప్రతీదాన్నీ వీటో చేస్తూ కూర్చోవాలని నేను అనుకోవడం లేదు. దేశానికి మంచి జరిగేలా చూసేందుకు డెమోక్రాట్లతో కలిసి పనిచేస్తాం" అని తెలిపారు. అయితే, డెమోక్రాట్లు మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినిధుల సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్న హకీమ్ జెఫ్రీస్ మాట్లాడుతూ, "మేము కీలకమైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. ఇప్పుడున్న వ్యవస్థలు సరిగా లేవు. అమెరికా ప్రజలకే ప్రాధాన్యత ఇచ్చే కాంగ్రెస్ కావాలి" అని స్పష్టం చేశారు. దీంతో రాబోయే రెండేళ్లలో ట్రంప్ పాలన ఎలా సాగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

సోషల్ మీడియాలో కాదు.. దమ్ముంటే సభలో చర్చకు రండి: రాహుల్‌కు నిర్మల సవాల్

మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు" అని నిర్మల పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్), ఈవీఎంల పనితీరుపై చర్చించేందుకు పార్లమెంటులో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేద్దామని హోంమంత్రి అమిత్ షా సోమవారమే ప్రతిపాదించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. "సోషల్ మీడియాలో సవాళ్లు విసిరినంత ఉత్సాహం పార్లమెంటులో చర్చకు ఎందుకు చూపించడం లేదు?" అని ఆమె ప్రశ్నించారు.ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు సభ నుంచి వాకౌట్ చేస్తున్నారని నిర్మలా సీతారామన్ ఆరోపించారు. "సమాధానాలు డిమాండ్ చేసేటప్పుడు, వాటిని వినే బాధ్యత కూడా ఉంటుంది. ఎన్నోసార్లు మీరు, మీ పార్టీ సభ్యులు ప్రభుత్వం స్పందిస్తున్న సమయంలోనే సభ నుంచి వాకౌట్ చేశారు. అలాంటప్పుడు చర్చకు అంత ఆసక్తిగా ఉన్నామని ఎలా చెప్పుకుంటారు?" అని ఆమె నిలదీశారు.ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంట్ సమావేశాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతున్నాయని ఆమె విమర్శించారు. "మీకు చర్చపై నిజంగా అంత ఆసక్తి ఉంటే, ముందు పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా సహకరించవచ్చు కదా?" అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నివాసంలో నిర్వహించిన "మాక్ పార్లమెంట్" కార్యక్రమాన్ని కూడా ఆమె తప్పుబట్టారు. అది "మాక్ పార్లమెంట్" కన్నా "పార్లమెంటును అపహాస్యం చేయడం"లా ఉందని ఎద్దేవా చేశారు.ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడేవారు ముందుగా ప్రజాస్వామ్య సంస్థలను గౌరవించాలని హితవు పలికారు. "'దరో మత్' (భయపడొద్దు) అని మీరు అంటుంటారు కదా. అలాంటప్పుడు వాస్తవాలతో, ఆధారాలతో సభకు రండి, విమర్శలను ఎదుర్కోండి, సమాధానాలు వినడానికి కూర్చోండి" అని రాహుల్ గాంధీకి నిర్మలా సీతారామన్ సవాల్ విసిరారు.

తమిళ సినీ పరిశ్రమకు సీఎం విజయ్ ప్రభుత్వం గుడ్ న్యూస్.. ఇకపై రోజుకు 6 షోలు!

మొదటి పేజీ తరువాయి)

అనుమతి ఇస్తూ ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా విడుదలైన మొదటి వారం రోజుల పాటు ఈ వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ ఆరు షోలను ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజామున 2:30 గంటల మధ్య ప్రదర్శించుకోవచ్చని తెలిపింది.గత కొంతకాలంగా తమిళ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్, తమిళ ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, తమిళనాడు థియేటర్ అండ్ మల్టీప్లెక్స్ ఓనర్స్ అసోసియేషన్ వంటి పలు సినీ సంఘాలు ప్రభుత్వానికి ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నాయి. కొత్త సినిమాలకు తొలి వారంలో ప్రేక్షకుల ఆదరణ ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో షోల సంఖ్య పెంచడం వల్ల పరిశ్రమకు, థియేటర్ల యజమానులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వారు తమ అభ్యర్థనలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరమే సీఎం జోసెఫ్ విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి 1957 నాటి తమిళనాడు సినిమాస్ (రెగ్యులేషన్) నిబంధనల ప్రకారం రాష్ట్రంలో రోజుకు కేవలం నాలుగు షోలకు మాత్రమే అనుమతి ఉండేది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సినీ పరిశ్రమ కోరిక మేరకు, కొత్త సినిమాలకు మొదటి వారం రోజులు, అలాగే పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలు, శని, ఆదివారాల్లో రోజుకు ఐదు షోలకు అనుమతి ఇచ్చింది. ఇప్పుడు దానిని మరో అడుగు ముందుకు వేసి ఆరు షోలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.కొత్త సినిమాలకు విడుదలైన మొదటి వారం మాత్రమే కాకుండా, స్థానిక పండుగ రోజులు, ప్రభుత్వ సెలవులు, వారాంతాల్లో (శని, ఆదివారాలు) కూడా రోజుకు ఆరు షోలు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంపై తమిళ సినీ పరిశ్రమకు చెందిన నిర్మాతలు, పంపిణీదారులు, థియేటర్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణించి పరిశ్రమకు అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుంది

- **పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం: మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది**

సూర్యాపేట, నవంబర్ 4(నేటి వెలుగు):

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు న్యాయం జరుగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 45వ వార్డు విద్యానగర్‌లో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సూర్యాపేట మున్సిపాలిటీకి రెండు విడతల్లో మొత్తం 1,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సహకరించిన జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయకుల సూచనలతో పట్టణంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో ఎలాంటి రాజకీయ పక్షపాతం, వివక్షకు తావులేదని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల అనంతరం పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందించడమే తమ విధానమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. 45వ వార్డులో రోడ్డు సమస్య ఉందని స్థానికులు ఫోన్ ద్వారా తన దృష్టికి తీసుకురాగానే వెంటనే మరమ్మతులు చేయించినట్లు వివరించారు.సూర్యాపేట పట్టణంలో సుమారు 3,500 మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ.. సూర్యాపేట పట్టణానికి 1,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించడంలో కృషి



చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను అభినందించారు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు.45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. వార్డులో ఏ సమస్యను తన దృష్టికి తీసుకెళ్లినా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, నాయకులు సవరాల సత్యనారాయణ, నరేంద్రుని హరీష్, వెంపటి మనోహర్, మున్సిపల్ డీఈ ప్రణయ్ రెడ్డి, ఏఈ తిరుమలయ్య, జవాను కొండేటి వెంకన్న, వార్డు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి





- **తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంపదపై ప్రత్యేక దృష్టి సారించాలి: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

నకిరేకల్, నవంబర్ 4 (నేటి వెలుగు)

ఎల్‌నినో వంటి సంక్లిష్ట వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులందరిపై ఉందని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.బుధవారం నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో ఎల్‌నినో ప్రభావంపై నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంపద, భూగర్భ జలాలు, ఆహార భద్రత, వ్యవసాయ కూలీల ఉపాధి వంటి రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తమ శాఖలపై పూర్తి అవగాహన కలిగి ఉండి ప్రజలకు మేలు జరిగేలా పనిచేయాలని కోరారు.మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని అన్నారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రస్తుతం కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాబోయే సీజన్లలో రైతులు సన్నధాన్యం సాగు చేసేలా ప్రోత్సహించాలని, రైస్ మిల్లర్లు కూడా సన్నధాన్యం కొనుగోలు చేసి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్ మిల్లర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.వీబీ–జీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో మట్టి రహదారులు, ఇతర గ్రామీణ రహదారుల నిర్మాణం, రహదారుల ఇరువైపులా కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలని అన్నారు.

భూగర్భ జలాలను కాపాడుకోవాలి: ఎంపీ చామల

భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితులపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో బోర్లు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, డిసెంబర్, జనవరి నెలల నుంచి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు. రైతులు యాసంగిలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం: ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.గత ప్రభుత్వం ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే ప్రస్తుత పరిస్థితులు మరోలా ఉండేవని అభిప్రాయపడ్డారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి కాలువల ప్రధాన పనులను పూర్తి చేసి వాటి ద్వారా చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా ప్రతి గ్రామంలోని నీటి వనరుల లభ్యతను విశ్లేషించాలని, నీటి వృథాను అరికట్టాలని సూచించారు.ఎల్‌నినో పరిస్థితులపై ప్రజలకు సమాచారం, సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 18004251442 టోల్‌ఫ్రీ నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, భూగర్భ జలాలు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టనున్న కార్యక్రమాలపై వివరించారు.మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలసిరి బతుకమ్మపై రూపొందించిన వీడియో సీడీని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ పాటల ద్వారా ఎల్‌నినో ప్రభావం, నీటి సంరక్షణపై అవగాహన కల్పించారు.

ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు

- **బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు.. అధికారులకు కలెక్టర్ ఆదేశం**
- **ఆరు బఫర్ గోదాంల హమాలీలకు లేబర్ కార్డులు ఇప్పిస్తాం**

కోదాడ నవంబర్ 4 (నేటి వెలుగు)

గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్



అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

హమాలీలకు లేబర్ కార్డులు

అనంతరం గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



మిహిరా శ్రీ నూతన వస్త్ర, ఫల పుష్పాలంకరణ వేడుకకు హాజరైన ఈగ మల్లేశం

హన్మకొండ, నవంబర్ 4 (నేటి వెలుగు)



హన్మకొండ పట్టణంలోని హంటర్ రోడ్‌లో ఉన్న డి కన్వెన్షన్ హాల్‌లో వరంగల్‌లోని శివనగర్‌కు చెందిన సింగిరెడ్డి యుగేందర్ -- రజిత దంపతుల కుమార్తె మిహిరా శ్రీ నూతన వస్త్ర, ఫల పుష్పాలంకరణ వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ లిశ్రీ ఈగ మల్లేశంలి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి మిహిరా శ్రీని ఆశీర్వదించారు. చిన్నారి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొత్తపెళ్లి శ్రీనివాస్, తుళ్ళ కుమారస్వామి, సిలువేరు కుమారస్వామి, కరిమిల్ల సంపత్ రావు, సంపత్ యాదవ్, వెంకటేశ్వర్ రావు, రవీందర్ రెడ్డి, రాజు, శ్యామ్, కృష్ణ తదితరులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

మణుగూరు డిపో కండక్టర్ ప్రవళిక మృతి పట్ల మంత్రి కోమటిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

హైదరాబాద్, నవంబర్ 4(నేటి వెలుగు):



మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గుండ్ల ప్రవళిక మృతి పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రవళిక పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద గత నెల 25న చిల్లర విషయంలో జరిగిన గొడవలో మణుగూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గుండ్ల ప్రవళిక తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందారు.ప్రవళిక మృతి పట్ల పలువురు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు.

ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు నిర్వహించాలి

- **రాష్ట్రవ్యాప్తంగా 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి.. మరో 1.90 లక్షల ఇళ్లు నిర్మాణ దశలో**
- **లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొనాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 4(నేటి వెలుగు)



రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న ప్రతి ఇంట్లో ఈ దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పేదల ఇళ్లలో వెలిగే ప్రతి దీపం తెలంగాణ ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.బుధవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక అవరోధాలు ఎదురైనా పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు.గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెళ్లి లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి పండుగ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు.

నాలుగు కార్పొరేషన్లలో ఇందిరమ్మ టవర్స్

రాష్ట్రంలో తొలి విడతగా 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ కార్పొరేషన్లలో కూడా ఇందిరమ్మ టవర్స్ నిర్మించనున్నట్లు ప్రకటించారు.జీ+5 విధానంలో నిర్మించనున్న ఈ టవర్స్‌కు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాల వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసేది లేదని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం హైదరాబాద్ నుంచి నేరుగా, పారదర్శకంగా నిధులు జమ చేస్తున్నట్లు వివరించారు.నగరాలు, పట్టణాలు, గ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, తద్వారా పేదల సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. సవీన్ కుమార్ గౌడ్

మిషన్ భగీరథతో రామదాస్ తండాలో ఫ్లోరోసిస్ సమస్యకు చెక్!





- **ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం అభినందనీయం: జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేశ్ భట్టాచార్య**

నల్గొండ జిల్లా, నవంబర్ 4(నేటి వెలుగు):

మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించడం వల్ల నల్గొండ జిల్లా నాంపల్లి మండలం రామదాస్ తండాలో ఫ్లోరోసిస్ సమస్య గణనీయంగా తగ్గడం పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేశ్ భట్టాచార్య సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా ఫ్లోరోసిస్ వంటి ఆరోగ్య సమస్యలను నివారించడంలో మిషన్ భగీరథ కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు.బుధవారం ఆయన రామదాస్ తండాను సందర్శించి ఇంటింటికీ తిరుగుతూ మిషన్ భగీరథ ద్వారా జరుగుతున్న తాగునీటి సరఫరాపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముందుగా గ్రామానికి చెందిన మెగావత్ అంతిరాం ఇంటికి వెళ్లి నల్లాల ద్వారా నీరు ఎన్ని రోజులకు ఒకసారి వస్తోంది? సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు రెండుసార్లు నీరు సరఫరా అవుతోందని, అవసరాల కోసం నీటిని నిల్వ చేసుకుంటున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. నల్లాలకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని ఆయన సూచించారు.మిషన్ భగీరథ పథకం ప్రారంభానికి ముందు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గతంలో బోరు నీటిపైనే ఆధారపడేవారమని, ఫ్లోరైడ్ నీటి కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నామని గ్రామస్థులు వివరించారు. రక్షిత తాగునీరు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఫ్లోరోసిస్ సమస్య తగ్గిందని గ్రామ సర్పంచ్ మెగావత్ చిట్టి శ్రీనివాస్ తెలిపారు.గ్రామంలో ఫ్లోరోసిస్ కేసులు ఏమైనా ఉన్నాయా అని ఆశా కార్యకర్తను అడిగి తెలుసుకోగా, ప్రస్తుతం ఎలాంటి కేసులు లేవని ఆమె తెలిపారు. గత పదేళ్లుగా ఫ్లోరోసిస్ కేసులు నమోదు కాలేదని మండల అధికారులు వివరించారు. సాధారణ సీజనల్ వ్యాధులు మినహా ఇతర ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించినట్లు గ్రామ కార్యదర్శి వివరించారు. గ్రామంలో మొత్తం 250 గృహాలు ఉన్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా డాక్టర్ అనిమేశ్ భట్టాచార్య మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడం ద్వారా ఫ్లోరోసిస్ వంటి వ్యాధులను నివారించవచ్చని అన్నారు. మిషన్ భగీరథ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఈ పర్యటనలో మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వరరావు, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ అజయ్ కుమార్, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ రామకృష్ణ శర్మ, సర్పంచ్ మెగావత్ చిట్టి శ్రీనివాస్, ప్రయోగశాల ఇన్‌చార్జి పి. వీరారెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హాలియా మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి: బీజేపీ నాయకులు





హాలియా రూరల్, నవంబర్ 4 (నేటి వెలుగు):

భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి సూచన మేరకు, ఎస్సీ మోర్చా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ ఆధ్వర్యంలో హాలియా మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు.అదేవిధంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ సరైన అవగాహన లేకుండా మాట్లాడుతోందని, ఆ పార్టీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఏరుకొండ నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు చినేని జాని, చిత్రం ఉదయ్, జిల్లా ఉపాధ్యక్షుడు మేదరి సైదులు, జిల్లా నాయకులు చింతపల్లి వెంకన్న, బొమ్మిడి శ్రీకాంత్, ఎర్ర యాదగిరి, నల్లగొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న చిన్ననాటి స్నేహితులు!

- **అకాల మరణం చెందిన మూశం సారంగపాణి కుటుంబానికి రూ.57 వేల ఆర్థిక సాయం**

వరంగల్, నవంబర్ 04 (నేటి వెలుగు):



ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి చిన్ననాటి మిత్రులు మానవత్వాన్ని చాటుకున్నారు. వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన మూశం సారంగపాణి ఇటీవల అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబం కష్టాల్లో పడింది. ఈ నేపథ్యంలో సారంగపాణి చిన్ననాటి మిత్రులంతా ఒక్కటై బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు.ఈ మేరకు మిత్రులందరూ కలిసి రూ.57,000 విరాళాలను సేకరించి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు చేతుల మీదుగా సారంగపాణి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బేతి అశోక్ బాబు మాట్లాడుతూ.. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన చిన్ననాటి మిత్రుల సేవాభావాన్ని అభినందించారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మనకు చేతనైన సహాయం అందించడం గొప్ప మానవతా విలువ అని పేర్కొన్నారు.స్నేహం అంటే కేవలం సంతోషాల్లో కలిసుండటమే కాకుండా, కష్టకాలంలోనూ తోడుగా నిలవడమేనని ఈ మిత్రులు తమ సేవా దృక్పథంతో మరోసారి నిరూపించారు.ఈ కార్యక్రమంలో లయన్ పోషల సురేందర్, దండు దయాసాగర్, రామ, రమేష్, మహేందర్, యుగేందర్, వెంకన్న, కృష్ణ, జగన్, గోరంట్ల మనోహర్, మంతెన అమ్రేష్ తదితర చిన్ననాటి మిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

‘రామాయణం’ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రభంజనం.. రూ.100 కోట్లకు చేరువలో!

విడుదలకు ముందే ‘రామాయణం’ సంచలనం

ఇప్పటికే దేశవ్యాప్తంగా 25 లక్షలకు పైగా టికెట్లు అమ్మకం

హిందీలో భారీ వసూళ్లు, తెలుగు, కన్నడలోనూ మంచి ఆదరణ

రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్



భారీ అంచనాల మధ్య రాబోతున్న ‘రామాయణం: పార్ట్ వన్’ చిత్రం విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్‌లో సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళ్తోంది. కేవలం భారత దేశంలోనే అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 100 కోట్ల మార్కుకు చేరువైంది.ప్రముఖ ట్రేడ్ ట్రాకర్ శాక్‌నిల్క్ నివేదిక ప్రకారం, నవంబర్ 4 ఉదయం నాటికి ఈ చిత్రం ఐదు రోజుల అడ్వాన్స్ సేల్స్ ద్వారా (బ్లాక్ చేసిన సీట్లతో కలిపి) రూ. 96.56 కోట్లు రాబట్టింది. బ్లాక్ చేసిన సీట్లను మినహాయిస్తే ఈ మొత్తం రూ. 77.31 కోట్లుగా ఉంది. నవంబర్ 5 నుంచి 9వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 83,000 షోలకు గాను సుమారు 25.65 లక్షల టికెట్లు అమ్ముడయ్యాయి. తొలిరోజైన నవంబర్ 5న అత్యధికంగా రూ. 39.35 కోట్ల అడ్వాన్స్ గ్రాస్ నమోదైంది.దేశీయ వసూళ్లలో దాదాపు 82 శాతం హిందీ వెర్షన్ నుంచే రాగా, తెలుగు, కన్నడ వెర్షన్లకు కూడా విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా మహారాష్ట్ర, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కర్ణాటక, తెలంగాణ సర్క్యూట్లలో టికెట్లకు భారీ డిమాండ్ కనిపిస్తోంది. త్రీడీ, ఐమ్యాక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలోనూ ప్రేక్షకులు సినిమా చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.నితేష్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మించారు. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తుండగా, సన్నీ డియోల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ రూ. 100 కోట్ల మార్కును దాటేశాయి. సినిమా విడుదలయ్యేలోపు భారత అడ్వాన్స్ బుకింగ్స్ కూడా రూ. 100 కోట్ల మైలురాయిని దాటుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జెడ్పీహెచ్ఎస్ ఆకుపాములలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





- **ఇంకుడు గుంతలు, టాయిలెట్లు, కిచెన్ పరిశీలన**
- **7వ తరగతి విద్యార్థులతో మాట్లాడి చదువుపై ఆరా**

సూర్యాపేట నవంబర్ 4 (నేటి వెలుగు)

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, విద్యాబోధన ప్రమాణాలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. శనివారం ఆకుపాముల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన ఆయన ఇంకుడు గుంతలు, టాయిలెట్లు, వంటగదిని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రమాణాలు, పరీక్షల సన్నద్ధత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల చదువు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వంటగదిని కూడా సందర్శించి మధ్యాహ్న భోజనం తయారీ, నిర్వహణను పరిశీలించారు. పాఠశాలలోని సమస్యలు, అవసరమైన సదుపాయాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి

పాఠశాలల్లో నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా ఫైనల్ ఇన్‌స్పెక్షన్ బృందంతో కలెక్టర్ సమావేశమై పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, లెర్నింగ్ అవుట్‌కమ్స్ ఆధారంగా పాఠాలు బోధిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలని సూచించారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ వినియోగం, లెసన్ ప్లాన్లు, ఇయర్ ప్లాన్లు, టీచింగ్ డైరీల నిర్వహణను తనిఖీ చేయాలని తెలిపారు. వర్క్‌షీట్ల ద్వారా విద్యార్థులకు నిరంతరం అభ్యాసం కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో నిత్యం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలో స్టాఫ్ రూమ్ పైకప్పు శిథిలావస్థకు చేరి స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ఇప్పటికే ఎంపీడీఓకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్య అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

హుజూర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లే నిర్మాణ పనుల్లో లోపాలు వెంటనే సరిచేయాలి

- **మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి -- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

హుజూర్‌నగర్, నవంబర్ 04 (నేటి వెలుగు):



హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మోడల్ కాలనీగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏవైనా చిన్నచిన్న లోపాలు ఉన్నా వెంటనే గుర్తించి సరిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు స్పష్టం చేశారు.బుధవారం ఎస్పీ కే. నరసింహతో కలిసి కలెక్టర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీని పరిశీలించారు. ఇటీవల మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతి బ్లాక్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, ఇళ్లలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు.ఇళ్ల నిర్మాణ పనులతో పాటు కాలనీలో మిగిలిపోయిన డ్రైనేజీ, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతుల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన ఇళ్లను అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**